# తీరని కోరిక

రచన:
కుమారి శాఖమూరి పద్మావతి

నాకు కథ వ్రాయాలని వుంది. ఏమని వ్రాయాలి! ఎలా వ్రాయాలి! ప్రేమకథ వ్రాయాలా! లేకపోతే వేరే యేదైనా కథ వ్రాయాలా! అని సందేహం. ఊహు! ప్రేమకథ వ్రాయను, ఎందుకంటే ఇప్పుడొచ్చే కథలన్నీ ప్రేమాయణాలే. ఎలాగైనా సరే ఒక కథ వ్రాయాలని నిశ్చయించుకున్నాను.

నేను కథ వ్రాయబోయేముందు నాగురించి కొంచెం చెపుతాను. నాకొక అన్నయ్య వున్నాడు. పేరు ప్రభాకరం. ఎం. ఎస్‌సి. చదివి కాలేజిలో లెక్చరరుగా పనిచేస్తున్నాడు. తర్వాత అక్కయ్య లక్ష్మి. అది మెడిసిన్ చదివింది. వివాహం అయింది. బావగారు కూడ డాక్టరు. ఇద్దరికి జనరల్ హాస్పిటల్‌లో వుద్యోగం. మాయింట్లోనే ఒక భాగంలో వుంటారు. అక్కకు నాలుగేళ్ళ బాబిగాడు. పేరు శ్యాం. తర్వాత రెండేళ్ళ బుజ్జి, దాని పేరు రాణి. ఇహ నాసంగతి. మా అమ్మనాన్నలకు నేనే ఆఖరి పిల్లను. నాకు చిన్నప్పటినుండి సంస్కృతం అన్నా, మాతృభాష తెలుగన్నా అమిత యిష్టం. ఫస్ట్‌ఫారం నుండి ఎస్. ఎస్. ఎల్. సి. వరకు సంస్కృతం చదివాను. తర్వాత నన్ను కూడ మెడిసిన్ చదివించాలని మానాన్న అన్నయ్యల ఆశయం. కాని నాకిష్టం లేదు. నా ఆశయం వేరు. తేనలొలుకు తెనుగు నుడికారపు సొబగును చవిచూడాలని ఓరియంటల్ కాలేజిలో చేరాను. ఇప్పుడు భాషాప్రవీణ ఆఖరు సంవత్సరం చదువుతున్నాను.

నాకు కథలంటే చాల యిష్టం. బాబిగాడు, బుజ్జి నాదగ్గరకు చేరి కథలు చెప్పమని అడిగితే అన్నీ కల్పించి చెపుతాను. ఒకసారి నేను చదువుకుంటూ వుంటె బాబిగాడు బుజ్జివచ్చి నేను చదివే పుస్తకం తీసి అవతల పెట్టి పిన్నీ పిన్నీ! మళ్ళీ కథ చెప్పవూ! అంటూ దగ్గర చేరారు. పుస్తకంలో లీనమయిన నాకు బలే కోపం వచ్చింది. అప్పుడు చెప్పను పోండి అని కసిరానంటే వాళ్ళు శ్రుతిమొదలు పెడతారు. ఏదో ఒక కథ కల్పించి చెపితేనే నయం. అనగనగా ఒక రాజు రాణి వున్నారు, ఆ రాజు రాణికి ఒక కొడుకు, బాబి బుల్లి కూతురు వున్నారు. వాళ్ళ పేరు ఏమిటంటే అని నేను చెపుతు వుండగనే బాబిగా డందుకొని అది నాకు తెలుసులే వాళ్ళ పేర్లు అన్నాడు. అయితే చెప్పు చూదాం అన్నాను. వాడు టక్కున శ్యాం, రాణి అని చెప్పాడు. ఈ రోజుకు ఇక చాల్లే పోయి పడుకోండి అన్నాను, వాళ్ళు ఊహు! చందమామలో రాక్షసుడి కథ చెబితేనే వెళ్ళుతాము అన్నారు. వాళ్ళిద్దరినీ ఎలాగో సర్ది చెప్పి మా బామ్మకు అప్పగించి పుస్తకం తీసుకున్నాను. ఇలా ఆదివారం తప్ప నాకు తీరిక వుండదు.

కథ మొదలు పెడదామని వైట్ పేపర్సు, పెన్ తీసుకొని రీడింగు రూమ్‌లోకి వెళ్ళి తలుపులు వేసుకున్నా. విఘ్నేశ్వరుని ప్రార్థించి పేపర్ మీద 'శ్రీరామ' అని వ్రాశి. అంతలో మా బామ్మ అమ్మడూ నీ కోసం నీ స్నేహితులొచ్చారే తలుపు తియ్యవే అని దబదబ బాదింది. హరి! భగవంతుడా! ఇప్పుడే రావాలా వీళ్ళు. అని మనస్సులో తిట్టుకుంటూ పేపర్సు, పెన్ అల్మారీలో పెట్టి తలుపు తీశాను. నా ఫ్రెండ్స్ కవితా, చిత్ర వచ్చారు. వాళ్ళిద్దరూ సాయంత్రం దాకా హాస్కు వేసుకొని కూర్చున్నారు. పోనీలే! రాత్రికి వ్రాద్దామనుకున్నా. అన్నయ్య, వదిన, అక్క, బావ సినిమాకు బయ

లుదేరారు. నన్ను రమ్మన్నారు. కథకోసం సినిమా మానుకోవటం నాకిష్టంలేదు. వచ్చే ఆదివారం వ్రాయచ్చులే అనుకొని సినిమాకు బయలుదేరాను. ఇలా యీ ఆదివారం పరుగు నరానే వచ్చింది. పేపర్సు పెన్ తీసుకొని యథా ప్రకారం రీడింగ్ రూమ్‌లో కూర్చుని ఈసారి ఏ విఘ్నాలు కలుగకుండా వుండాలని రెండు సార్లు విఘ్నేశ్వరుని స్తుతించి 'శ్రీరామ' అని వ్రాయబోయా. పెన్‌లో ఇంకి లేదు. లేచి అవతల గదిలో వున్న ఇంకీ బాటిల్ తెచ్చుకొని పెన్‌లో పోస్తూ కూర్చున్న. ఇంతలో తప తపా మని ఏదో క్రిందపడ్డ శబ్దం అయ్యింది. వెనక్కి తిరిగి చూద్దాను గదా బాబిగాడు ర్యాక్‌లో వున్న నా పుస్తకాలు మనుచరిత్ర, వసుచరిత్ర వగైరాలన్ని క్రిందకు పడేసి వాటిని మోయటానికి అవస్థపడుతున్నాడు, నా కేడ్పువచ్చినంత పనైంది. గబగబా వెళ్ళి వాడి వీపుమీద రెండంటించి పుస్తకాలు సర్దుకోవటం మొదలు పెట్టాను. వాడు భైరవి రాగంలో మా అక్కయ్యదగ్గరకు చేరాడు. పుస్తకాలన్ని త్వర త్వరగా సర్దేసి వెనక్కి తిరిగేసరికి పేపర్స నిండా సిరాగుమ్మరించి, వంటినిండా, ముఖం మీద పులుముకొని చేతులతో తుడుచు కుంటూ పిన్నీ! అంటూ ఎదురొచ్చింది బుజ్జి. చూచేసరికి నాకు నవ్వాలో, ఏవాడలో తెలయలేదు. మా అక్కయ్యను పిలిచి కోపంగా చూడవే! చూడు! ముద్దులమూట, నీ వరాల పంటచేసిన ఘనకార్యం చూడు అన్నాను కోపంగా. అది పగలబడి నవ్వుతూ ఏమండోయ్ అంటూ బావగార్ని, అన్నయ్య వదినలను యింట్లో అందరిని కేకవేసింది. బుజ్జిని చూసి అందరు పొట్ట చెక్కలయ్యేటట్టు నవ్వుతున్నారు. నా కేడ్పు ఆగలేదు. మీరందరు ఒకటేను మీరందరు యిక్కడినుండి వెళ్ళిపోండి అని విసురి గది తలుపు వేసుకొని పడుకున్నాను. సాయంత్రం। అందరు వరండాలో కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. నేనప్పుడే నిద్రలేచి దొడ్లో కెళ్ళి ముఖం కడుక్కొని బామ్మ యిచ్చిన కాఫీగ్లాసు తీసుకొని ఒక కుర్చీలో కూలబడి కాఫీ సిఫ్ చేస్తున్న నెమ్మదిగ. ఏం మరదలా! కథ వ్రాస్తున్నావట. ఎందాకా వచ్చింది! కథపేరేం పెట్టావ్! అన్నారు నవ్వుతూ మా బావగారు.

'ఇంకా మొదలే పెట్టంది వ్రాయటందాకా యెక్కడిది' అన్నాను వచ్చే కోపాగ్ని దిగ మ్రింగుతూ.

అంతలో మా అన్నయ్య అందుకుని 'చెల్లాయ్! ఎందుకు నీకీకథ లిప్పుడు చెప్పు. శ్రద్ధగా నీ కావ్యాలు చదువుకో ఈ సంవత్సరం ఫైనల్ గదా! చదువు అయిపోయినాక తీరికగా కథలు మొదలు పెడుదువుగాని' అన్నాడు సవినయంగా చివరికి కథ వ్రాయాలనే నా కోరిక యీ విధంగా వున్నది. అది తీరని కోరికగానే నిలచి పోయింది,



Edited and Published by A. N. Raghavachar, No. 6-B. Murugesamudali Street, Madras-1
Printed by R. Bakthavachalu Bharathamatha Press No. 39, Anderson St, Madras-1